ఇంటర్ ఫలితాల్లో బాలికల హవా

- ఫస్టియర్‌లో జిల్లాలో 57.93 శాతం
- సెకండియర్‌లో 68.67 శాతం

జాహ్నవి, ఉమామహేశ్వర్, కే రిషికేశ్‌రెడ్డి

గిర్మాజీపేట, ఏప్రిల్ 22: ఇంటర్మీడియట్ ఫలితాలు మంగళవారం వెలువడ్డాయి. జిల్లాలో ఈ ఏడాది కూడా బాలికలే హవా కొనసాగించారు. ఫస్టియర్‌లో 57.93 శాతంతో రాష్ట్రంలో జిల్లాకు 18వ స్థానం, సెకండియర్‌లో 68.67 శాతంతో 18వ స్థానం సాధించినట్లు డీఐఈవో డాక్టర్ గంగిశెట్టి శ్రీధర్‌సుమన్ తెలిపారు. జనరల్ విభాగం నుంచి ఫస్టియర్‌లో బాలికలు (2039/2989) 68.22 శాతం, బాలురు (851/1978) 43.02 శాతం.. మొత్తం ఫస్టియర్‌లో (2890/ 4967) 58.18 శాతంతో ఉత్తీర్ణత సాధించారు. ఒకేషనల్ విభాగం ఫస్టియర్‌లో బాలురు (97/315) 30.79 శాతం, బాలికలు (381/532) 71.62 శాతం పాస్ అయ్యారు. మొత్తం ఫస్టియర్ ఒకేషనల్‌లో (478/847) 56.43 శాతం ఉత్తీర్ణత నమోదైంది. జనరల్ విభాగం నుంచి సెకండియర్‌లో బాలికలు (2263/2877) 78.6 శాతం, బాలురు (1029/1866) 55.14 శాతం కలిసి సెకండియర్‌లో (3292/4743) 69.41 శాతం ఉత్తీర్ణులయ్యారు. ఒకేషనల్ విభాగం నుంచి సెకండియర్‌లో బాలురు (70/227) 30.84 శాతం, బాలికలు (347/431) 80.51 శాతంతో సెకండియర్ ఒకేషనల్‌లో (417/658) 63.37 శాతం ఉత్తీర్ణత సాధించారు. కాగా, ఫస్టియర్ ఎంపీసీలో పిన్నింటి యశ్వంత్ (466/470) ఖానాపురం జీజేసీ, బైపీసీలో అల్ఫియా అంజుమ్ (425/440) రంగశాయిపేట జీజేసీ, సీఈసీలో జీనత్ (473/500) వరంగల్ కృష్ణాకాలనీ జీజేసీ, హెచ్‌ఈసీలో పి.సింధు(419/500) వరంగల్ కృష్ణాకాలనీ జీజేసీ, సెకండియర్ ఎంపీసీలో జీ ఉమామహేశ్వర్ (978/1000) ఖానాపురం జీజేసీ, కే రిషికేశ్‌రెడ్డి(978/1000) నర్సంపేట జీజేసీ, బైపీసీలో జాటోత్ జాహ్నవి (981/1000) నర్సంపేట జీజేసీ, సీఈసీలో సయ్యద్ సాదియా (960/1000) వరంగల్ కృష్ణాకాలనీ జీజేసీ, హెచ్‌ఈసీలో వరంగల్ కృష్ణాకాలనీ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఏ లక్ష్మీప్రసన్న 943 మార్కులు సాధించింది.

కేజీబీవీ విద్యార్థుల ప్రతిభ

ఇంటర్ ఫలితాల్లో జిల్లాలోని కేజీబీవీ విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబర్చినట్లు డీఈవో డీ వాసంతి ఒక ప్రకటనలో తెలిపారు. ఫస్టియర్ ఎంపీసీలో ఖానాపురం కేజీబీవీ నుంచి యూ నవనీత లోకేశ్వరి 422/470, బైపీసీ నుంచి వర్ధన్నపేట కేజీబీవీకి చెందిన కే వాసవి 379/440, సీఈసీలో గీసుగొండ కేజీబీవీ నుంచి నాగరాణి 449/500, ఎంపీహెచ్‌డబ్ల్యూలో చెన్నారావుపేట కేజీబీవీ నుంచి బీ చందన 476/500 మార్కులతో టాపర్‌గా నిలిచారన్నారు. అలాగే, సెకండియర్ ఎంపీసీలో వర్ధన్నపేట కేజీబీవీ నుంచి లోకేశ్వరి 953/1000, బైపీసీ నుంచి అదే పాఠశాలకు చెందిన బీ గౌతమి 947/1000, నల్లబెల్లి కేజీబీవీ నుంచి సీఈసీ విభాగంలో బీ హేమలత 935/1000, ఎంపీహెచ్‌డబ్ల్యూ విభాగంలో నల్లబెల్లి కేజీబీవీ నుంచి డీ శిరీష 974/1000 మార్కులతో టాపర్‌గా నిలిచారని డీఈవో వెల్లడించారు.

బీఆర్ఎస్ నాయకులను నిర్బంధించిన పోలీసులు

కలెక్టర్, ఎమ్మెల్యేను కలవకండా.. బీఆర్ఎస్ నాయకులను అడ్డుకున్న పోలీసులు

- పంటనష్టంపై విన్నవించేందుకు వెళ్తుండగా ఘటన
- నాయకులను నిర్బంధించడం అప్రజాస్వామికం
- బీఆర్ఎస్ శ్రేణుల ధ్వజం

ఖానాపురం, ఏప్రిల్ 22: పంట నష్టంపై కలెక్టర్, ఎమ్మెల్యేను కలిసేందుకు వెళ్తున్న బీఆర్ఎస్ నాయకులను పోలీసులు నిర్బంధించిన ఘటన మంగళవారం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. ఇటీవల కురిసిన వడగళ్ల వానకు పాకాల ఆయకట్టులో వేలాది ఎకరాల్లో పంటనష్టం జరిగింది. దెబ్బతిన్న పంటలను నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పరిశీలించి, వెంటనే సర్వే చేపట్టి ఎకరాకు రూ. 25 వేల నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు ఇటీవల బాధిత రైతులతో కలిసి ఖానాపురం జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. అయినా ప్రభుత్వంలో చలనం రాలేదు. కనీసం ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పంటలను పరిశీలించలేదు. ఈ నేపథ్యంలో మంగళవారం ఖానాపురం రైతు వేదికలో భూ భారతిపై రైతులకు అవగాహన కల్పించేందుకు కలెక్టర్ సత్యశారద, దొంతి రావడంతో మాజీ ఎంపీపీ ప్రకాశ్‌రావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు వారిని కలిసి వినతిపత్రం అందించేందుకు పార్టీ కార్యాలయంలో సిద్ధమవుతున్నారు. విషయం తెలుసుకున్న నర్సంపేట టౌన్ సీఐ రమణమూర్తి, స్థానిక ఎస్సై రఘుపతి, దుగ్గొండి ఎస్సై వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీసులు కలెక్టర్, ఎమ్మెల్యేను కలవకుండా అడ్డుకున్నారు. వారు తిరిగి వెళ్లే వరకూ పోలీసులు బీఆర్ఎస్ నాయకులతోనే ఉన్నారు.

నిర్బంధించడం అప్రజాస్వామికం

వడగళ్ల వానకు పంటలు దెబ్బతిని రైతులు దిక్కుతోచని స్థితిలో ఉంటే.. పంటలను సర్వే చేసి ఆదుకోవాల్సిన ప్రభుత్వం ఇప్పటి వరకు కనీసం స్పందించకపోవడం శోచనీయమని మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, ఏఎంసీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. కలెక్టర్, ఎమ్మెల్యే ఖానాపురం వస్తుండడంతో వారిని కలిసి సమస్యను వివరించేందుకు వెళ్తున్న బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అడ్డుకుని గంటలతరబడి నిర్బంధిండం అప్రజాస్వామికమన్నారు. రైతుల గోడును వినాల్సిన అధికారులు ముఖం చాటేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే రైతులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పోలీసులు అడ్డుకున్న వారిలో నాగార్జునరెడ్డి, ఆబోత్ ఆశోక్, బాలు, వల్లెపు సోమయ్య, మర్రి రామస్వామి, సుధాకర్, కార్యకర్తలు ఉన్నారు.

వేసవి క్రీడా శిక్షణ శిబిరాల ఏర్పాటు

కాశీబుగ్గ, ఏప్రిల్ 22: రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఆదేశాల మేరకు మే 1 నుంచి 31 వరకు వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహించనున్న డీఎస్‌డీవో సత్యవాణి ఒక ప్రకటనలో తెలిపారు. రూరల్, అర్బన్ ఏరియాలో సమ్మర్ కోచింగ్ క్యాంప్ నిర్వహించే కోచ్‌కు రూ. 4 వేల గౌరవ వేతనంతోపాటు స్పోర్ట్స్ మెటీరియల్ క్యాంప్ ముగిసిన తర్వాత సర్టిఫికెట్స్ ఇస్తారని పేర్కొన్నారు. శిక్షణ శిబిరాలను ఉపయోగించుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు. ఆసక్తి గల వారు 7702155096 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

నేడు వాహనాల బహిరంగ వేలం

నర్సంపేట, ఏప్రిల్ 22: నర్సంపేట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు బుధవారం బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ ఆర్.నరేశ్‌రెడ్డి మంగళవారం తెలిపారు. వేలం పాటలో పాల్గొనేవారు ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీతో ఎక్సైజ్ స్టేషన్‌లో కలవాలని, వేలం పాట ఉదయం 9 గంటలకు ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు బహిరంగ వేలంలో పాల్గొనాలని కోరారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

I, GATTU VENKATESHWARLU, S/o Gattu Nambaiah, R/o H.No. 3-124/1, Panagatla, Kamalapur Mdl, Hanamkonda Dist., T.G, India. I Have changed my Name From GATTU VENKATESWARLU to GATTU VENKATESHWARLU, S/o Gattu Nambaiah for all purposes.

PLOT FOR SALE

★వరంగల్ హైవే రఘునాథపల్లికి దగ్గరలో 2 లక్షలకే 121 Sq.yds. Plots అన్ని డెవలప్‌మెంట్స్‌తో కలవు. స్పాట్ రిజిస్ట్రేషన్. ఫోన్: 8523041059.
NT-329891

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

కరీమాబాద్: మాట్లాడుతున్న నన్నపునేని నరేందర్, నర్సంపేట: 16వ వార్డులో మాట్లాడుతున్న బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణగౌడ్

రజతోత్సవాన్ని విజయవంతం చేద్దాం

బీఆర్ఎస్ శ్రేణులు దండులా తరలిరావాలి

కేసీఆర్ చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలి

మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ పిలుపు

వాడవాడలా సన్నాహక సమావేశాలు

కరీమాబాద్, ఏప్రిల్ 22: బీఆర్ఎస్ ఆవిర్భవించి 25 వసంతాలు పూర్తయిన సందర్భంగా ఈ నెల 27న ఎల్కతుర్తిలో నిర్వహించనున్న రజతోత్సవ మహాసభను సమష్టిగా విజయవంతం చేద్దామని మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ పిలుపునిచ్చారు. ఉర్సులో మంగళవారం వరంగల్ 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి నివాసంలో ముఖ్య నాయకులతో ఆయన సన్నాహక సమావేశం నిర్వహించారు. బీఆర్ఎస్ శ్రేణులంతా మహాసభకు దండులా తరలిరావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధిని కార్యకర్తలు ప్రజలకు వివరించాలని కోరారు. సమావేశంలో మాజీ కార్పొరేటర్ మరుపల్ల భాగ్యలక్ష్మి, పూజారి విజయ్, వనం కుమార్ పాల్గొన్నారు.

దండు కడదాం.. దర్జాగా బయల్దేరుదాం

నర్సంపేట/చెన్నారావుపేట/నెక్కొండ/పోచమ్మమైదాన్: హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభకు దండు కట్టి దర్జాగా బయల్దేరుదామని బీఆర్ఎస్ నర్సంపేట పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణగౌడ్ పిలుపునిచ్చారు. పట్టణంలోని 16వ, 22వ వార్డుల్లో సన్నాహక సమావేశాలు జరిగాయి. సభకు పార్టీ శ్రేణులు, ప్రజలు, రైతులు వేలాదిగా తరలిరావాలని కోరారు. అనంతరం వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, మాజీ ఎంపీపీ నల్లా మనోహర్‌రెడ్డి, బీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజ్, పట్టణ ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు నాయకులు పాల్గొన్నారు. అలాగే, నర్సంపేట మండలంలోని ముగ్దుంపురం, రాజపల్లి, కమ్మపల్లిలో సన్నాహక సమావేశాలు నిర్వహించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నామాల సత్యనారాయణ నాయకులకు దిశానిర్దేశం చేశారు. పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఈర్ల నర్సింహరాములు, క్లస్టర్ ఇన్‌చార్జిలు కోమాండ్ల గోపాల్‌రెడ్డి, మోతె పద్మనాభరెడ్డి, మోటూరి రవి, మచ్చిక నర్సయ్యగౌడ్, కొడారి రవన్న, కడారి కుమారస్వామి, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు. చెన్నారావుపేట మండలంలోని జోజిపేట నారాయణతండాలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు రోజుల్లో వివాహ బంధంతో ఒక్కటి కానున్న హరీశ్-అంకిత సైతం సభకు వస్తామని మద్దతు తెలిపారు. బీఆర్ఎస్ నేతలతో కలిసి పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బాల్నె వెంకన్న, జక్క అశోక్, కంది కృష్ణ చైతన్యరెడ్డి, కుమారస్వామి, విజయా బాలజోజి, నరేందర్, మురళీనాయక్ పాల్గొన్నారు. నెక్కొండ మండలంలోని గొల్లపల్లిలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్కతుర్తి సభకు భారీగా తరలిరావాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సంగని సూరయ్య పిలుపునిచ్చారు. మాజీ వైస్ ఎంపీపీ దొనికెన సారంగపాణి, మాజీ సర్పంచ్ లింగాల విజయా వెంకన్న, గ్రామ అధ్యక్షుడు కత్తుల సదానందం తదితరులు పాల్గొన్నారు. కాగా, నెక్కొండలో బీఆర్ఎస్ రజతోత్సవ సభ వాల్ రైటింగ్‌ను ప్రారంభించారు. వరంగల్ 21వ డివిజన్ తిలక్‌రోడ్డులో పార్టీ మహిళా డివిజన్ అధ్యక్షురాలు ముష్కె ప్రమీల ఇంటింటికీ వెళ్లి బొట్టు పెట్టి మహిళలను సభకు ఆహ్వానించారు. గీసుగొండ మండలంలోని బొడ్డుచింతలపల్లి, గీసుగొండ, ఎలుకుర్తి, మనుగొండ, కొమ్మాల, మచ్చాపురం, గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్‌లో సన్నాహక సమావేశాలు నిర్వహించారు. సభకు భారీగా తరలిరావాలని బీఆర్ఎస్ నాయకుడు సుంకరి శివకుమార్, మాజీ సర్పంచ్ యుగేంధర్ పిలుపునిచ్చారు. మాజీ జడీటీసీ పోలీసు ధర్మారావు, మండల కార్యదర్శి వేణుగోపాల్ రెడ్డి, మాజీ సర్పంచ్‌లు బోడకుంట్ల ప్రకాశ్, పూండ్రు జైపాల్‌రెడ్డి, అంకతీ నాగేశ్వర్‌రావు, అనిల్, నాయకులు రవీందర్‌రెడ్డి, నాగయ్య, వీరన్న, మంత రాజయ్య, రాజేందర్ పాల్గొన్నారు.

చెన్నారావుపేట: బీఆర్ఎస్ నాయకులతో కలిసి పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వధూవరులు

వరంగల్ తిలక్‌రోడ్డులో మహిళకు బొట్టుపెడుతున్న పార్టీ డివిజన్ అధ్యక్షురాలు ప్రమీల

విద్యార్థులను అభినందిస్తున్న ధృవ కళాశాల యాజమాన్యం

ఇంటర్ ఫలితాల్లో 'ధృవ' ప్రభంజనం

పోచమ్మమైదాన్, ఏప్రిల్ 22: ఇంటర్మీడియట్ ఫలితాల్లో వరంగల్ పోచమ్మమైదాన్‌లోని ధృవ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులు విజయ దుందుభి మోగించారు. ఎంపీసీ ప్రథమ సంవత్సరంలో నలుగురు, బైపీసీలో ఇద్దరు, సీఈసీలో ఇద్దరు, ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో ఇద్దరు, బైపీసీలో ముగ్గురు, సీఈసీలో ఇద్దరు విద్యార్థినులు రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించి కళాశాల, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకొచ్చారని ధృవ జూనియర్ కళాశాల చైర్మన్ ఆకుల శ్రీనివాస్, డైరెక్టర్లు ఆకుల సంపత్, ఆకుల సతీశ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినులు, అందుకు కృషి చేసిన అధ్యాపకులను యాజమాన్యం సన్మానించింది.

ఏసీపీతో కాజీపేట, వరంగల్ ఆర్‌పీఎఫ్ సీఐలు

నేర నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ

వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్

వరంగల్ చౌరస్తా, ఏప్రిల్ 22: వరంగల్ నగరంలో శాంతిభద్రతల పరిరక్షణకు రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్(ఆర్‌పీఎఫ్) పోలీసులతో కలిసి ఉమ్మడి కార్యాచరణ చేపడతామని వరంగల్ సబ్ డివిజన్ ఏసీపీ నందిరాంనాయక్ అన్నారు. మంగళవారం మట్టెవాడ ఏసీపీ కార్యాలయంలో కాజీపేట, వరంగల్ రైల్వే పోలీస్ ఇన్‌స్పెక్టర్లు చిన్నయి చటర్జీ, శ్రీనివాస్‌గౌడ్ ఏసీపీని మర్యాదపూర్వకంగా కలిశారు. పొగాకు ఉత్పత్తుల తరలింపు, మానవ అక్రమ రవాణా, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు అందించాల్సిన సహకారం, తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.

తండ్రి చావుకు కారణమైన వారిని శిక్షించాలి

వర్ధన్నపేట, ఏప్రిల్ 22: వృద్ధుడైన తండ్రిని మనోవేదనకు గురిచేసి, ఆత్మహత్య చేసుకునేలా చేసిన కొడుకు, కోడలును కఠినంగా శిక్షించాలని సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కోన్‌రెడ్డి మల్లారెడ్డి, రిటైర్డ్ డీఎస్పీ దామెర నర్సయ్య డిమాండ్ చేశారు. ఇటీవల కడారిగూడెంలో నాంపెల్లి మల్లేశం(90) కొడుకు, కోడలి వేధింపులతో ఆత్మహత్య చేసుకున్నాడు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే మల్లేశం కుమారుడు, కోడలును కఠినంగా శిక్షించాలని వారు కోరారు. సమావేశంలో యూనియన్ ప్రతినిధులు సదానందం, యుగేంధర్, సీడీపీవో దుబేరా, మాజీ సర్పంచ్ సతీశ్ పాల్గొన్నారు.

రేపు సెంట్రల్ జైలులో నిరుపయోగ వస్తువుల వేలం

పోచమ్మమైదాన్, ఏప్రిల్ 22: వరంగల్ కేంద్ర కారాగారం, జిల్లా సబ్ జైళ్ల అధికారి కార్యాలయానికి చెందిన నిరుపయోగ వస్తువులను ఈ నెల 24న ఉదయం 11 గంటలకు వేలం వేయనున్నట్లు వరంగల్ కేంద్ర కారాగారం పర్యవేక్షణాధికారి కళాసాగర్ ఒక ప్రకటనలో తెలిపారు. డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ ప్రిజన్స్ వరంగల్ రేంజ్ సమక్షంలో వరంగల్ మామునూరు కేంద్ర కారాగారం ప్రాంగణంలో బహిరంగ వేలం ద్వారా విక్రయిస్తారని, ఆసక్తిగల వారు ఒకరోజు ముందుగా ధ్రువీకరించుకుని బహిరంగ వేలంలో పాల్గొనాలని సూచించారు.

నర్సంపేట: ఇటీవల రాత్రి వీచిన ఈదురుగాలులకు వృక్షం విరిగి వ్యవసాయ మార్కెట్ ఆవరణలోని తహసీల్దార్ కార్యాలయ బోర్డుపై పడింది. ఎనిమిది రోజులు గడుస్తున్నా చెట్టును తొలగించడం లేదు. తహసీల్దార్ స్పందించి చెట్టు కొమ్మలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

రైతుల సమస్యల పరిష్కారానికి కొత్త చట్టం

మాట్లాడుతున్న నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

ఖానాపురం, ఏప్రిల్ 22: రైతుల భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి చట్టం తెస్తున్నట్లు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి, కలెక్టర్ సత్యశారద అన్నారు. మండలకేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం భూ భారతిపై అవగాహన సదస్సు నిర్వహించారు. భూ భారతి పోర్టల్‌తో ప్రస్తుతం రైతులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు చక్కని పరిష్కారం లభించనుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నర్సంపేట నియోజకవర్గంలోనే ఖానాపురం మండల పరిధిలో అనేక భూ సమస్యలు ఉన్నాయన్నారు. అన్నింటికీ పరిష్కారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో నర్సంపేట ఏఎంసీ చైర్మన్ పాల్వాయి శ్రీనివాస్, వైస్ చైర్మన్ హరిబాబు, నర్సంపేట ఆర్డీవో ఉమారాణి, తహసీల్దార్ కిరణ్‌కుమార్, మండల స్పెషలాఫీసర్ సౌజన్య, ఎంపీడీవో సునీల్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

వేసవి వడగాలులపై అప్రమత్తంగా ఉండాలి

ఖిలావరంగల్, ఏప్రిల్ 22: వేసవి వడగాలులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సత్యశారద అన్నారు. కలెక్టరేట్‌లో వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ప్రచార మాధ్యమాల ద్వారా వేసవి వడగాలుల తీవ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జూలై వరకు ఆశ కార్యకర్తల నుంచి జిల్లాస్థాయి అధికారుల వరకూ ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. వడదెబ్బ తగిలితే తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ ప్రచార బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు. స్వచ్ఛంద సంస్థల సహకారంతో కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ఉపాధి పనుల సమయంలో మార్పులు చేయాలని సూచించారు. సమీక్షలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్వో విజయలక్ష్మి, జడ్పీ సీఈవో రాంరెడ్డి, డీసీవో నీరజ పాల్గొన్నారు.

భూమిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి

ఆక్రమణకు గురైన భూమిని పరిశీలిస్తున్న ఎమార్పీఎస్ నాయకులు

చెన్నారావుపేట, ఏప్రిల్ 22: దళితుల భూమిని ఆక్రమించుకున్న వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు బిర్రు మహేందర్ కోరారు. మండలంలోని పాపయ్యపేటలో ఆక్రమణకు గురైన దళితుల భూమిని మంగళవారం ఆయన పరిశీలించారు. గ్రామానికి చెందిన ఎల్లయ్య తండ్రికి గతంలో ప్రభుత్వం మూడు కరాల అసైన్డ్ భూమి ఇచ్చిందన్నారు. వ్యవసాయం చేసే స్తోమత లేక వారు బీడుగా వదిలేశారన్నారు. దీన్ని అదనుగా భావించిన గ్రామానికి చెందిన ఓ పెద్ద మనిషి భూమిని ఆక్రమించి తన పేరున పట్టా చేయించుకున్నాడని ఆరోపించారు. రెవెన్యూ అధికారులు స్పందించి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట కట్ల రాజశేఖర్, తడుగుల విజయ్, ఆరెపల్లి బాబు, శోభన్, గోలి సుధాకర్, చిలపాక బాబు ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్ని వసతులు

పోచమ్మమైదాన్: ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు

పోచమ్మమైదాన్/కరీమాబాద్/కాశీబుగ్గ, ఏప్రిల్ 22: అంగన్‌వాడీ కేంద్రాల్లో మహిళలకు ఆరోగ్యంతోపాటు వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంటాయని ఐసీడీఎస్ జిల్లా సంక్షేమ అధికారి రాజమణి తెలిపారు. పోషణపక్షం కార్యక్రమంలో భాగంగా 21వ డివిజన్‌లో మంగళవారం సమావేశం నిర్వహించారు. గర్భిణులకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందిస్తున్నట్లు తెలిపారు. సూపర్‌వైజర్ ఎం.వెంకటేశ్వరి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సీడీపీవో పి.విద్య, సఖీ అడ్మిన్ వల్లెశ్రీలత, కార్పొరేటర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిల్లలకు అక్షరాభ్యాసాలు, అన్నప్రాసన, మహిళలకు సీమంతాలు నిర్వహించారు. అలాగే, ప్రతి ఒక్కరూ పోషకాహారంపై అవగాహన పెంచుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బత్తిని రమాదేవి సూచించారు. కరీమాబాద్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం పోషక విలువలపై అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. అంతేకాకుండా కార్పొరేట్ ప్రీప్రైమరీ స్కూళ్లకు దీటుగా అంగన్‌వాడీ కేంద్రాలు పని చేస్తున్నాయని డీడబ్ల్యూవో రాజమణి అన్నారు. కాశీబుగ్గ ప్రాంతంలో మండల స్థాయి పోషణపక్షం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రీప్రైమరీ స్కూల్ పిల్లలకు కథలు, పాటలు, జనరల్ నాలెడ్జ్‌కు సంబంధించిన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో విద్య, సూపర్‌వైజర్ లావణ్య, టీచర్ లత, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

బొలెరో వాహనాన్ని ఢీకొట్టిన లారీ

వర్ధన్నపేట, ఏప్రిల్ 22: ఆగి ఉన్న బొలెరో వాహనాన్ని లారీ ఢీకొట్టిన ఘటన మంగళవారం జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం రాజమండ్రి నుంచి వరంగల్‌కు కొబ్బరికాయల లోడ్‌తో వస్తున్న బొలెరో వాహనం టైరు పగిలిపోవడంతో డ్రైవర్ వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలోని భవానికుంటతండా సమీపంలో జాతీయ రహదారి పక్కన నిలిపాడు. ఈ క్రమంలోనే ఖమ్మం నుంచి వరంగల్ వైపు వస్తున్న లారీ బొలెరో వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో బొలెరోలో ఉన్న కొబ్బరికాయలన్నీ చెల్లాచెదురుగా పడిపోయాయి. తండావాసులు, ప్రయాణికులు కొబ్బరికాయ బస్తాలను తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి'

నర్సంపేట, ఏప్రిల్ 22: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని ఏఐఎఫ్‌టీయూ(న్యూ) రాష్ట్ర అధ్యక్షుడు మోడెం మల్లేశం డిమాండ్ చేశారు. పట్టణంలో మంగళవారం జిల్లా మిల్ అండ్ హామాలీ వర్కర్స్ యూనియన్ అనుబంధ ఏఐఎఫ్‌టీయూ(న్యూ) జిల్లా కార్యవర్గ సమావేశం బొల్లి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెరిగిన ధరలకనుగుణంగా హమాలీల కూలీ రేట్లు పెంచాలన్నారు. రైస్‌మిల్లుల్లో ధాన్యం దిగుమతికి ఉపయోగిస్తున్న ప్లాస్టిక్ సంచులను తక్షణమే నివారించాలని కోరారు. పాలకులు ప్రేరేపిస్తున్న కుల, మతతత్వాలకు వ్యతిరేకంగా కార్మికులంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు రొట్టె శ్రీనివాస్, యాకన్న, మంద మల్లయ్య, జనార్దన్, గడ్డం శ్రీనివాస్, ఈర్ల రాజు, వెంకటేశ్వర్లు, లింగన్న, సదానంద